క్లుప్తంగా

కనక దుర్గమ్మను దర్శించుకున్న సర్నాల



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కుటుంబ సమేతంగా విజయవాడ కనకదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తిరుపతిరావు దంపతులకు ఆశీస్సులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తిరుపతిరావు తెలిపారు. దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ కరీం, గర్నేపూడి వెంకటరావు, ఎస్.దుర్గాప్రసాద్, బాణావత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. స్వరార్చన సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నూతన తెలుగు సంవత్సరం, శ్రీరామనవమి సందర్భంగా సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమా సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉంటుందన్నారు. దేశ సాంస్కృతిక వైభవంలో వారు భాగస్వాములని తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో పాల్గొనాలని సూచించారు. స్వరార్చన నిర్వాహకుడు యామీ రత్నం సంస్థ లక్ష్యాలను వివరించారు. అనంతరం పరచూరి విజయలక్ష్మి, నిడుమోలు రమా సత్యనారాయణను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

వైభవంగా పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పటమట(విజయవాడతూర్పు): పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ ఎనిమిదో రోడ్డు లోని నల్లూరు చక్రధర్‌రావు వీధిలో పంచముఖ ఆంజనేయస్వామి ధ్యాన మందిర విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకమైన కృష్ణ శిలతో తయారు చేయించిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి తిరుపతిలో హోమాలు చేయించి ఈ నెల 18న కాలనీకి తీసుకొచ్చారు. మూడు రోజులపాటు యాగ క్రతులు నిర్వహించిన అనంతరం ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమల నుంచి వచ్చిన రుత్వికులు, వేదాచార్యులు, ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించి ఉదయం 10 గంటల 52 నిమిషాలకు స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నల్లూరు కాశీ దంపతులు, గర్నేని చలపతి రావు, తిలక్ దంపతులు, నడకుదుటి నారాయణ దంపతులు ఆధ్వర్యంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులందరి సహకారంతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కనులారా తిలకించేందుకు ఎలక్ట్రిసిటీ కాలనీతో పాటు పరిసర కాలనీల ప్రజలు వేలాదిమంది తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని మహిళలు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

విజయవాడకల్చరల్: అభినయ నృత్యాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్యనారాయణపురం సీతారామ కల్యాణ వేదికపై ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచారిణి వీ కృష్ణగౌతమి ఆధ్వర్యంలో చిన్నారులు హిమజ, జ్యోత్స్నిక, హర్షిత, వర్షిణి, రమ్యలు కూచిపూడి సంప్రదాయంలో మహా గణపతింతో ప్రారంభించి వినాయక కౌతం, రామదాసు కీర్తన, పలుకే బంగార మాయనా, అన్నమయ్య సంకీర్తన తందనానా ఆహి, ధేంతలూరే, సిరినవ్వుల వాడే కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి కృష్ణగౌతమి మాట్లాడారు.

జగనన్న ప్రభుత్వానికి అడుగడుగునా నీరాజనాలు

పశ్చిమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ విస్తృత ప్రచారం



47వ డివిజన్‌లో ఆసిఫ్, భాగ్యలక్ష్మి, గోదావరి గంగలను ఆశీర్వదిస్తున్న ప్రజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 38, 46, 47, 48 డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. తొలుత 38వ డివిజన్ పరిధిలోగల సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ అలీ హుసేన్ షా, సయ్యద్ షా దర్గాలను సందర్శించి స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మల్లికార్జునపేటలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీనర్‌పేట, ఆంజనేయవాగు సెంటర్, పాల ప్రాజెక్ట్ వరకు కొండ ప్రాంతాల్లోని పలు అడ్డ రోడ్లు మీదుగా పర్యటించారు. 47వ డివిజన్ పరిధిలోని గండమాల అచ్చమ్మ వీధి నుంచి కలరా హాస్పటల్ వరకు స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి పర్యటించారు. గడప గడపకు వెళ్లి ఇప్పుడు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే సీఎం జగన్ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని గమనించాలని, ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో మునుపెన్నడూ లేని విధంగా మెట్లు, డ్రెయిన్లు, రోడ్లు నిర్మాణాలు జరిగాయని ఆసిఫ్ గుర్తు చేశారు. ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధికి



38వ డివిజన్‌లో ప్రచారంలో ఆసిఫ్, కార్పొరేటర్ రెహమతున్నీసా

సమపాళ్లలో ప్రాధాన్యత ఇచ్చిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో రెండు (ఒకటి ఎంపీ అభ్యర్థి, మరొకటి ఎమ్మెల్యే అభ్యర్థి) ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో అన్ని మతాలు, కులాలు కలిసి మెలసి అన్నదమ్ముల్లా జీవిస్తున్న తరుణంలో మతతత్వ పార్టీకి సంబంధించిన వ్యక్తులను తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వంలా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్న నియోజకవర్గ ప్రజల మనసుల్లో విషం నింపేందుకు వస్తున్న కూటమి అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు అత్తలూరి పెదబాబు, రాయన నరేంద్ర, షేక్ హయాత్ షరీఫ్, గోదావరి బాబు, కూరాకుల నాగ, మజ్జి శ్రీదేవి, మజ్జి శ్రీనివాసరావు, గురుమహంత మహేష్, ఏనుగుల సునీల్, జీఎంసీ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ మహావీర్ పంచ సూత్రాలే మోక్ష మార్గాలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



భగవాన్ మహావీర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భగవాన్ మహావీర్ బోధించిన అహింస, అస్తేయ, బ్రహ్మచర్యం, సత్యం, అపరిగ్రహం అనే పంచ సూత్రాలే మోక్ష మార్గాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహావీరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ తన 36వ ఏటనే సన్యాసాన్ని స్వీకరించిన వర్ధమానుడు 12 ఏళ్లపాటు తపస్సు చేసి మహావీరుడుగా జైన మత ప్రచారకులయ్యారని గుర్తు చేశారు. జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తరువాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగు చేశాయని తెలిపారు. ప్రపంచానికి ఆయన అందించిన శాంతి సందేశం, అహింస, కరుణ వంటి అనేక బోధనలు నేటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. తాము జీవించడమే కాకుండా ఇతరులు కూడా జీవించడానికి తోడ్పాటు అందించాలని, ఎవరినీ బాధ పెట్టకూడదన్నదే మహావీరుడి సిద్ధాంతమని తెలిపారు. భూమి, గాలి, నీరు, నిప్పు, వృక్షజాలం ఉనికిని విస్మరించిన వ్యక్తి వాటితో ముడిపడి ఉన్న తన ఉనికినే కోల్పోతాడని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో నివసిస్తున్న జైనులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జైనులను గుర్తించి గౌరవించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అందుకు ప్రత్యేకంగా జైన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, టి.చంద్రశేఖరరెడ్డి, ఇరువూరి నర్సారెడ్డి, కటన్ కరిముల్లా, మారంరెడ్డి వెంగళరెడ్డి, మండల శ్రీనివాసరావు, కేసరి రాజ, షేక్ జాకీర్, కసిరెడ్డి రోశిరెడ్డి, పైడాల శ్రీను, షేక్ జిలానీ, శివారెడ్డి, నాగరాజు, షేక్ నయామ్ పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):సొరంగం సమీపంలోని శ్రీనూకాలమ్మ అమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం అమ్మ వారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఏటా అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు పేర్కొన్నారు. సాయంత్రం వెండి రథంతో దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నూకాలమ్మ వారి దేవస్థానం తరుపున పట్టు చీర, పూలు, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని సమర్పించామని నిర్వాహకులు పేర్కొన్నారు.

బ్యాంకులను దోచుకున్న దొంగలను నమ్మకండి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్



51వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో పిట్టల దొరలా ప్రజలకు మాయ హామీలిచ్చి మోసగించే ప్రయత్నం చేస్తున్న టీడీపీ కూటమి నేతలను ప్రజలు తరిమికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని 51, 52 డివిజన్లలోని కొండ ప్రాంతాల్లో ఆసిఫ్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ హద్దులు తెలియని నాయకులు ఇటీవల ఢిల్లీ నుంచి సూట్‌కేసులు పట్టుకొని నగరానికి వలస వచ్చారన్నారు. బీసీలను మోసం చేసి సీటు లాక్కొని రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని చెప్పారు. ఆ నేతలు పలు జాతీయ బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయాల దోచేసి దేశ ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ మాటలు తాను చెప్పటం లేదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వ నిఘా సంస్థలు, న్యాయస్థానాలు చెప్పిన మాటలని ప్రచార మాధ్యమాల్లో వచ్చాయన్నారు. అటువంటి నేతలు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు సింగపూర్ చేస్తానని, ఎకరాల స్థలాలు కొనిస్తానంటూ మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మానీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ కేసు ఎదుర్కొంటున్న నేతలు ఇక్కడ ప్రజలకు కోట్లాది రూపాయలతో మేలు చేస్తానంటూ పిట్టలదొర మాటలు చెబుతున్నారని విమర్శించారు. చంద్రబాబు సింగపూర్ చేస్తానంటూ కోట్లాది రూపాయాల ప్రజాధనాన్ని దోచేశారని చెప్పారు. అదేబాటలో పెద్దకుర్రతో బీజేపీ అభ్యర్థి ఇక్కడ ప్రజలను మోసం చేయటానికి అన్ని రకాల హామీలు చేస్తున్నారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు చాలా విజ్ఞానవంతులన్నారు. అంతేకాకుండా రాజకీయ పరిణితి ఉన్న నాయకులన్నారు. వారంతా ఇటువంటి నాయకులను నమ్మే పరిస్థితులు ఉండవని చెప్పారు. కూటమి నాయకులను తరిమికొట్టడం ద్వారా పశ్చిమ నియోజకవర్గాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతాల్లోని ప్రజలను కలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, రెహమతున్నీసా, 52వ డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చైత్రమాస ఉత్సవాలు



దుర్గమ్మ కొలువుదీరిన ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు వెండి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారు భక్తుల ఇంట ముంగిటకు విచ్చేయడంతో తన్మయానికి లోనయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పాదచారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో హరివిల్లు ఫౌండేషన్ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యాధరపురం, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. పాదచారులు, వాహనచోదకుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హరివిల్లు ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు.కనకారావు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకూ వేసవి తాపంతో ఇబ్బంది పడుతున్న పాదచారులకు, వాహనచోదకులకు చల్లటి మజ్జిగను అందజేశామన్నారు. ఫౌండేషన్ కోశాధికారి ఎం.రవి కుమార్, వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్, శ్రీదేవి, అధ్యక్షులు ఎం. శశికాంత్, కె. శ్రీనివాసరావు, జీఎన్‌బీ అప్పలరాజు, కె. సుబ్రహ్మణ్యం, పి. త్రినాథ్, పిట్ల రమేష్ కుమార్, మణికంఠ, అజయ్ కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం భార్యను వేధిస్తూ, ఆమెపై దాడి చేసిన భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నివశిస్తున్న షేక్ తస్లీమాబేగంకు 10 ఏళ్ల క్రితం కట్నకానుకలు ఇచ్చి షేక్ షాబాజితో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఫ్లెక్సీల ప్రింటింగ్ షాపులో పని చేస్తాడు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. తస్లీమాబేగంపై దాడి చేసి చంపుతానని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రాజీనామా చేసి ఆసిఫ్‌ను కలిసిన వలంటీర్లు



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌తో రాజీనామా చేసిన వలంటీర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వివిధ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామాలు చేసి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జగనన్నపై తమకు నమ్మకం ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఆయన ప్రభుత్వం గెలుపుతోపాటు ఆసిఫ్ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ జనబలం ఉన్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలు అందించి పేదల హృదయాల్లో జగనన్న చెరగని ముద్ర వేశారన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి అన్నారు. భగవాన్ మహావీర్ జయంతిని పురస్కరించుకుని వర్ధమాన్ వికాస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్థానిక గుజరాతీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. శ్రీదేవి కంటి ఆసుపత్రి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన దుర్గాశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహావీర్ జయంతిని పురస్కరించుకొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కళ్లను సంరక్షించుకోవాలని చెప్పారు. శ్రీదేవి కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ కళ్లను సంరక్షించే విధంగా అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. చాలామంది స్థానికులకు దృష్టి లోపాలు, కంటి శుక్లాలు వచ్చాయని పేర్కొన్నారు. వాళ్లకి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ రమ్యశ్రీ, ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగ సాధన అవసరమని గ్రంథాలయాధికారి కె.రమాదేవి అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం ఆధ్యాత్మిక విశ్వగురువులు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉచిత యోగాసన, ప్రాణాయామ, ధ్యాన శిక్షణ అవగాహన తరగతులు ప్రారంభమయ్యాయి. రమాదేవి మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు తొమ్మిది వారాల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. తొలిరోజు సుమారు 50 మంది ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ట్రైనర్ వి.ప్రభాకర్, సూర్య, ఆకాశవాణి ఇంజినీర్ టి.నాగేశ్వరరావు గురుదేవుల విశిష్టత, ఆసన, ప్రాణాయామ ధ్యానం వల్ల లాభాలను వివరించారు. నారాయణరావు, ప్రమీల, స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా శోభాయాత్ర



వన్‌టౌన్‌లోని జైనులు ఆదివారం నిర్వహించిన శోభాయాత్ర సందడిగా సాగింది. మహావీర్ జయంతిని పురస్కరించుకొని జైనులు భారీ యాత్ర నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, పిల్లలు, పెద్దలు పాల్గొని కోలాహలంగా ముందుకు సాగారు. వెండి రథంలో మహావీరుని విగ్రహాన్ని జైనులు ఊరేగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





పెనమలూరు సర్పంచ్‌పై దాడి

పెనమలూరు: పెనమలూరు సర్పంచ్, ఆయన తనయుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఆశ్రమం కాలువ కట్ట పై వనమాల అంజి మరి కొందరు వ్యక్తులతో కలిసి బ్యాంకు జీరో అకౌంట్ తెరిస్తే రూ.2 వేలు అకౌంట్‌లో పడతాయని చెప్పి మహిళల ఆధార్‌కార్డు వివరాలు, వేలిముద్రలు సేకరించసాగారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సర్పంచ్ లింగాల భాస్కరరావు, ఆయన కుమారుడు వెంకటనాగసాయికుమార్ ఘటనా స్థలానికి వెళ్లి మహిళలకు అవగాహన కల్పించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడే ఉన్న వనమాల అంజి ఆగ్రహంతో సర్పంచ్ భాస్కరరావు, ఆయన కుమారుడిపై దాడి చేశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.